# వెంటాడే ప్రేమ!

—వసుంధర

"గురూ! నీ ప్రేమ వ్యవహారం ఎందాకా వచ్చింది?" అనడిగాడు సుబ్బారావు. అతడి పక్కనే వున్న చంద్రకాంత్, సూర్యం, ప్రదీప్‌లు నోరు తెరిచి అడక్కపోయినా వాళ్ళ కళ్ళలో అదే ప్రశ్న కనబడుతోంది.

రఘునాథ్ వాళ్ళ కెదురుగా వున్నాడు. స్నేహపూర్వకంగా సుబ్బారావతణ్ణి గురువన్నప్పటికీ అతడప్పుడు గురువు శిష్యుల్ని చూసినట్టే వాళ్ళని చూస్తూ మందహాసం చేస్తూ,పిట్టకు నేనంటే ఆరాధన బయల్దేరింది, శీలంలో రాముడిననీ, చతురతలో కృష్ణుడిననీ, ప్రతాపంలో అర్జునుడిననీ, మంచి అలవాట్లకు మహాత్మా గాంధీననీ నమ్ముతోంది. ఎటొచ్చీ పెళ్ళయ్యేదాకా వంటి మీద చేయి వేయనిచ్చేలా లేదు" అన్నాడు.



"అయితే ఏం చేస్తావ్? పెళ్ళి చేసుకుంటావా?" అన్నాడు ప్రదీప్ కంగారుగా. ప్రదీప్ ఆమె నెక్కడ పెళ్ళి చేసుకుంటానంటాడోనని రఘునాథ్ అంటే ఎక్కువ కంగారు పడిపోతున్నాడు.

"పెళ్ళా? దాన్నా?" అని నవ్వాడు రఘునాథ్. "మీరు నా మాటలు గుర్తుంచుకోండి. ఆడపిల్లను వల్లో వేసుకోవాలంటే చాలా సులభం. ఓ అందమైన పిల్లను పట్టుకోండి. దాని అందాన్ని పొగడండి. ఆ అందం కోసం ప్రపంచంలో ఏమైనా త్యాగం చేయవచ్చునని నండి. మిమ్మల్ని మీరు అపర అవతార పురుషుల్లా అభివర్ణించుకోండి. కట్నానికి వ్యతిరేకంగా నినాదాలు పలకండి. స్త్రీకి సమాజ మివ్వాల్సిన గౌరవం గురించి అతిశయోక్తులు పలకండి. అంతే, ఆ పిల్ల పడిపోతుంది. ఆ సెంటిమెంటులో పడి పెళ్ళి మాత్రం చేసుకోకండి. ఎందుకంటే పెళ్ళితో ప్రేమకు ఫుల్‌స్టాప్".

"అయితే మరి జీవితంలో పెళ్ళే చేసుకోకూడదా?"

"చేసుకోవాలి. పేద పిల్లను ప్రేమించాలి. డబ్బున్న దాన్ని పెళ్ళిచేసుకోవాలి. అప్పుడే ఇహమూ, పరమూను..."

"నువ్వు విలన్‌లా మాట్లాడుతున్నావు."

"నాలోని విలన్ని మీరే చూస్తారు. నా ప్రియురాలు నాలో హీరోని చూస్తుంది. అదే జీవితంలోని మజా!"

"అయితే ఇప్పటి నీ ప్రియురాలి నేంచేస్తావు?"

"ఈనేట్టితో తాడోపేడో తేల్చేస్తాను" అని మరోసారి నవ్వాడతడు. ఆ నవ్వు విలన్ నవ్వులాగే వుంది.

*　　*　　*

"డార్లింగ్! మన ప్రేమను చూసి కొందరసూయపడుతున్నారు. నీకూ, నాకూ చెడగొట్టాలని ప్రయత్నిస్తున్నారు" అన్నాడు రఘునాథ్.

"భయపడకు. మూడవ మనిషి మాటలు నేను నమ్మను."

"కానీ, నాకు భయంగా వుంది. నేను తాగుతాననీ, వ్యభిచరిస్తాననీ, జూదమాడతాననీ, అప్పుడప్పుడు డ్రగ్సు కూడా తీసుకుంటాననీ తప్పుడు సాక్ష్యాలు సృష్టించి నీకు చూపాలనుకుంటున్నారు కొందరు ..."

"నీ మీద నాకు నమ్మకమున్నంత కాలం అలాంటివాళ్ళ ప్రయత్నాలు ఫలించవు."

"అయ్యో! నీ కర్థంకావడం లేదు. మన ప్రేమ గురించి కొందరప్పుడే ఇంట్లో చేరేశారు. అమ్మా, నాన్నా నాకు వేరే సంబంధం సెటిల్ చేశారు. కట్నం లక్ష రూపాయిలు. పిల్ల బంగారంలా వుంటుంది. కానీ, నిన్ను తప్ప వేరెవర్నీ భార్యగా స్వీకరించలేను."

"అయితే ఈ రోజే పెళ్ళి చేసుకుందాం."

"కుదరదు. అమ్మకు గుండె జబ్బు. నెమ్మదిగా తనకీ వార్తను చేరవేయాలి. అందుకు నాకు కొంత వ్యవధి కావాలి."

"సరే, నేను నీ కోసం ఎంత కాలమైనా వేచి వుండగలను."

"నాకో ఉపాయం తోచింది."

"ఏమిటది?"

రఘునాథ్ తన ఉపాయాన్నామెకు వివరించి చెప్పాడు.

ఆ ప్రకారం ఇద్దరూ పెళ్ళికి ముందే ఒకటవ్వాలి. అందువల్ల చాలా ప్రయోజనాలున్నాయి. తన ప్రియురాలు సంప్రదాయానికి కట్టుబడి రఘునాథ్‌ని తప్ప ఇంకెవర్నీ పెళ్ళి చేసుకోలేదు. అందువల్ల చెప్పుడు మాటల నామె వింటుందన్న భయమే అతడికుండదు. ఒకసారి శారీరక సంబంధం ఏర్పడ్డాక ఆమె నతడూ వదులుకోలేడు. తనకేర్పడిన నైతిక బాధ్యత బలంతో పెద్ద లేర్పరచిన పెళ్ళి నతడు ప్రతిఘటించగలుగుతాడు. అంతే కాదు, రఘునాథ్ తల్లికీ విషయం తెలిస్తే వెంటనే ఈ పెళ్ళికి ఒప్పుకుంటుంది.

ఆమె ఓపికగా అతడు చెప్పిందంతా విని, "నీవు నీ వైపు మంచి ఆలోచించి ఈ ఉపాయం చన్నావు. నా అభిప్రాయంతో శారీరక సంబంధం లేకుండా గుళ్ళో పెళ్ళి రహస్యంగా చేసుకుంటే ఇంకా ఎక్కువ ప్రయోజనముంటుంది. నేను చెప్పుడు మాటలు వినను, నీ నైతిక బాధ్యత పెరుగుతుంది. నీ తల్లి సంప్రదాయాన్ని కాదనదు, అన్నింటికీ మించి సమాజం కూడా మనకండగా వుంటుంది. పెళ్ళి ఎంతకాలం రహస్యంగా వుంచమంటే అంతకాలమూ వుంచగలను" అంది.

రఘునాథ్ నిట్టూర్చి, "నువ్వు నన్ను నమ్మడం లేదు" అన్నాడు.

"నీ ఉపాయం కంటే నా ఉపాయం బాగుంది. నీ కెందుకు నచ్చడం లేదో నాకు తెలియడం లేదు" అందామె కూడా అతడిలాగే నిట్టూర్చి.

అతడు మళ్ళీ వివరించాడు.

రఘునాథ్ తల్లి కొడుకు పెళ్ళి మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ పెళ్ళి కళ్ళారా చూడాలని ఆమె కోరిక. కొడుకు రహస్యంగా పెళ్ళి చేసుకుంటే ఆమె భరించలేదు. ఆ షాక్‌తో ఆమె గుండె ఆగిపోయినా ఆశ్చర్యం లేదు.

"తన కొడుకో యువతికి పెళ్ళికి ముందే శారీరకంగా దగ్గరైతే ఏమీ కాని నీ తల్లి గుండె మన పెళ్ళికి మాత్రం ఏదో అయిపోతుందంటావ్?"

రఘునాథ్ దీనంగా "నేను నీకు మోసగాడిలా అనిపిస్తున్నానా?" అన్నాడు.

"ఛీ - అంత మాటనకు. ఊహలో కూడా నువ్వు మోసగాడివంటే భరించలేను" అందామె.

"మరి నా ఉపాయాని కెందుకు

ఒప్పుకోవు?''

''పెళ్ళికి ముందు మనకు కొంత దూరం తప్పదు. ఆ సంప్రదాయం పాటించకపోతే నన్ను నేనే క్షమించుకోలేను. వివాహమైనాక తొలి రాత్రి పవిత్రంగా నా భర్త దగ్గరకు వెళ్ళాలని నా కోరిక. అది చాలా బలమైన కోరిక.''

''అయితే ఇంకే ఉపాయమూ లేదు. మన పెళ్ళి జరగదు.''

''బెదిరిస్తున్నావా?''

''లేదు. ఏడుస్తున్నాను. నిన్ను పెళ్ళి చేసుకోలేకపోతే ఈ ప్రపంచంలో నా కంటే దురదృష్టవంతుడుండడు. నీవు నన్నభిమానించావు, ప్రేమించావు, ఆరాధించావు. కానీ, నేను నిన్ను పెళ్ళి చేసుకోలేకపోతున్నాను ...' రఘునాథ్ నిజంగానే వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఆమె అతడి వంక గంభీరంగా చూస్తూ, ''ఏడ్చే మగాళ్ళే నమ్మకూడదంటారు. నీ ఉపాయం కాదన్నానని జీవితంలో మొదటిసారిగా నా ముందు ఏడ్చావు'' అంది.

రఘునాథ్ కన్నీళ్ళు తుడుచుకొని, గొంతు సవరించుకుని, ''నీవు నా కెంతో ఆత్మీయురాలివి. మనసులోని బాధ దించుకునేందుకు నీ ముందు ఏడ్వడానికైనా సిగ్గుపడను'' అన్నాడు.

''ఇంతగా నన్ను నమ్మి, నా కోసం పరితపించే నువ్వు నన్నే పెళ్ళి చేసుకోలేవా?''

''చేసుకోగలను. కానీ నెల్లాళ్ళలో నా పెళ్ళి ముహూర్తం నిర్ణయించబడింది. అది ప్రతిఘటించడానికి నాకు శక్తి కావాలి, బలం కావాలి. ఆ రెండూ నీ నుంచే రావాలి నాకు'' అన్నాడు రఘునాథ్.

''భయపడకు. ఆ పెళ్ళి నేనాపగలను!'' అందామె.


''ఏ పెళ్ళి?''

''అదే - సుకన్యతో నీ పెళ్ళి!''

రఘునాథ్ తడబడుతూ, ''సుకన్య నీకెలా తెలుసు?'' అన్నాడు.

''నేను నిన్ను ప్రేమించాను. నా ప్రేమ నిన్నెప్పుడూ వెంటాడుతూనే వుంటుంది. ఆ విధంగానే సుకన్య నాకు తెలుసు ...''

''ఈ పెళ్ళి నీ వెలా ఆపగలవు? మన ప్రేమ గురించి చెబితే ఆమె పట్టించుకోదు. ఆమె తల్లిదండ్రులలాంటివి పట్టించుకోరు. పెళ్ళీడు మగాడి చుట్టూ ఎందరో ఆడపిల్లలు వలపన్ని వుంచుతారని వాళ్ళ అభిప్రాయం ...''




''ఆ పెళ్ళి ఎలా ఆపుతానో నేను చెబుతాను. కానీ, అప్పుడు జీవితాంతం ఓ గొప్ప అదృష్టాన్ని కోల్పోతావు'' అందామె.

''ఏమిటా అదృష్టం?''

''తన్నారాధించే ఆడపిల్ల ఏ మగాడికైనా గర్వకారణం. అదే ఏ మగాడికైనా జీవితాశయం. కానీ, ఆ ఆరాధన అసహాయత కారణంగా వచ్చిన నటన అని తెలిస్తే అదా మగాడికి షాక్! ఈ సమాజంలో ప్రతి ఆడపిల్లకూ పెళ్ళి అవసరం. మగడెలాంటివాడైనా ఫరవాలేదు. మగడంటూ వుంటే తప్ప ఆమెకు గౌరవం, విలువ, రక్షణ లేవు! కాబట్టి ...'' అని ఆగి, ''ఇంకా చెప్పమనే అంటావా?'' అందామె.

''ఊ '' అన్నాడతడు భయంతో కూడిన కుతూహలంతో.

''నీకు నీ ఆఫీసులో జూలీ అనే టైపిస్టుతో సంబంధ ముంది. రోజూ రాత్రి ఎనిమిది నుంచి పది వరకు నువ్వు సూర్యకాంతి బార్ అండ్ రెస్టారెంట్లో వుంటావు. వారానికొకసారి మూనర్లైటన్ క్లబ్‌లో పేకాడతావు. ఇందుకవసరమయ్యే డబ్బు నీ ఉద్యోగం ఇవ్వదు. అందుకని క్లబ్‌లో కొందరు మాఫియా రాజాలకు తొత్తుగా వుంటున్నావు. ఈ వివరాలన్నీ సుకన్య ఇంట్లోకి చేరవేస్తాను. ఈ వివరాలు చాలా రహస్యం కావచ్చు. కానీ, నేను రుజువు చేయగలను. ఇవన్నీ ముందే తెలిసి కూడా నిన్ను పెళ్ళాడాలనుకునే ఓ మధ్యతరగతి ఆడపిల్లను కాదనకు. ఇప్పటికే ఓ అదృష్టానికి దూరమయ్యావు. మరో అదృష్టానికి దూరం కాకు'' అందామె.

రఘునాథ్‌కి నోట మాట రాలేదు. తమాయించుకునేందుకు అతడికొంత సేపు పట్టింది.

''ఆలోచించుకునేందుకు వ్యవధి కావాలి నాకు'' అన్నాడతడు నెమ్మదిగా.

''నీ క్కావలసినంత వ్యవధి తీసుకో ఎప్పుడైనా నీ తల్లిదండ్రులు వేరే పెళ్ళి చేయాలనుకుంటే మాత్రం నెడగొట్టడానికి నా సాయం తీసుకో'' అంటూ లేచి వెళ్ళిపోయిందామె.

అతడూ లేచి అక్కణ్ణించి కదిలాడు. ఆలోచిస్తూంటే, ''ఇప్పటికే ఓ అదృష్టాన్ని పోగొట్టుకున్నావు'' అన్న మాట అతడి చెవుల్లో గింగురుమంటున్నాయి.

అతడెక్కడికి వెళ్ళినా ఆమె ప్రేమ అతణ్ణే వెంటాడుతున్నట్టే వుంది.

*

సెట్ ఫైటర్
కొత్త సంవత్సరం కొత్త సీరియల్స్
పార్ట్ టైమ్ హజ్బెండ్

మరియు త్వరలో
'జడలో జాబిలి'
కొత్త సీరియల్